"మధురమైన పిల్లలూ - అంతర్ముఖులుగా అయి మీ కళ్యాణము గురించి ఆలోచించండి, విహరించడానికి, తిరగడానికి వెళ్ళినప్పుడు ఏకాంతములో విచార సాగర మంథనము చేయండి, మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి - నేను సదా హర్షితముగా ఉంటున్నానా"

ప్రశ్న:- దయార్ద్ర హృదయుడైన తండ్రి యొక్క పిల్లలు తమపై తాము ఏ దయను చూపించుకోవాలి?

జవాబు:- ఏ విధముగా తండ్రికి నా పిల్లలు ముళ్ళ నుండి పుష్పాలుగా అవ్వాలి అని దయ కలుగుతుంది, తండ్రి పిల్లలను పుష్పాలుగా తయారుచేయడానికి ఎంతగా కష్టపడతారు, కావున పిల్లలకు కూడా తమపై తమకు దయ కలగాలి - మేము బాబాను ఓ పతిత పావనా రండి, పుష్పాలుగా తయారుచేయండి అని పిలుస్తాము, ఇప్పుడు వారు వచ్చారు, మరి మేము పుష్పాలుగా అవ్వమా! దయ కలిగితే దేహీ-అభిమానులుగా ఉంటారు, తండ్రి ఏదైతే వినిపిస్తారో దానిని ధారణ చేస్తారు.

ఓం శాంతి. వీరు తండ్రి కూడా, టీచర్ కూడా మరియు సద్గురువు కూడా అని పిల్లలు అర్థం చేసుకున్నారు. తండ్రి పిల్లలను అడుగుతున్నారు - మీరు ఇక్కడకు వచ్చినప్పుడు ఈ లక్ష్మీ-నారాయణుల చిత్రాన్ని మరియు మెట్ల చిత్రాన్ని చూస్తారా? ఎప్పుడైతే ఈ రెండింటినీ చూడడం జరుగుతుందో, అప్పుడు - మేము దేవతలుగా అయ్యి, తర్వాత ఈ విధంగా మెట్లు దిగుతూ వచ్చాము అని లక్ష్యము మరియు మొత్తం చక్రము బుద్ధిలోకి వస్తాయి. ఈ జ్ఞానము పిల్లలైన మీకే లభిస్తుంది. మీరు స్టూడెంట్. లక్ష్యము-ఉద్దేశ్యము ఎదురుగా ఉంది. ఎవరైనా వస్తే వారికి - ఇది లక్ష్యము-ఉద్దేశ్యము అని అర్థం చేయించండి. ఈ చదువు ద్వారా ఈ దేవీ-దేవతల వలె అవుతారు. తర్వాత 84 జన్మల మెట్లు దిగుతారు, మళ్ళీ రిపీట్ చేయాలి. ఇది చాలా సహజమైన జ్ఞానము, అయినా కానీ చదువుతూ, చదువుతూ ఫెయిల్ ఎందుకు అవుతారు? ఆ భౌతిక చదువు కన్నా ఈ ఈశ్వరీయ చదువు చాలా సులభమైనది. లక్ష్యము-ఉద్దేశ్యము మరియు 84 జన్మల చక్రము ఎదురుగానే ఉన్నాయి. ఈ రెండు చిత్రాలూ విజిటింగ్ రూమ్ లో కూడా ఉండాలి. సేవ చేయడానికి సేవా సాధనాలు కూడా కావాలి. వీటిలోనే మొత్తం జ్ఞానమంతా ఉంది. ఈ పురుషార్థాన్ని కూడా మనం ఇప్పుడే చేస్తాము. సతోప్రధానముగా అయ్యేందుకు చాలా కష్టపడాలి. ఇందులో అంతర్ముఖులుగా అయి విచార సాగర మంథనము చేయాలి. విహరించడానికి, తిరగడానికి వెళ్ళినప్పుడు కూడా బుద్ధిలో ఇదే ఉండాలి. నంబరువారుగా ఉన్నారు అనైతే బాబాకు తెలుసు. ఎవరైనా బాగా అర్థం చేసుకుంటే తమ కళ్యాణం కొరకు తప్పకుండా పురుషార్థం చేస్తూ ఉండవచ్చు. వీరు బాగా చదువుతారు అని విద్యార్థులు ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటారు. స్వయం చదవకపోతే తమను తామే నష్టపరుచుకుంటారు. స్వయాన్ని ఎంతోకొంత యోగ్యులుగా తయారుచేసుకోవాలి. మీరు కూడా విద్యార్థులే, అందులోనూ అనంతమైన తండ్రికి విద్యార్థులు! ఈ బ్రహ్మా కూడా చదువుతారు. లక్ష్మీ-నారాయణులు అనేది పదవి మరియు మెట్లు అనేవి 84 జన్మల చక్రానికి సంబంధించినవి. అది మొదటి నంబరు జన్మ మరియు ఇది చివరి నంబరు జన్మ. మీరు దేవతలుగా అవుతారు. లోపలికి వచ్చిన వెంటనే ఎదురుగా ఉన్న లక్ష్యము-ఉద్దేశ్యము గురించి మరియు మెట్ల గురించి అర్థం చేయించండి. రోజూ వచ్చి వీటి ఎదురుగా కూర్చున్నట్లయితే స్మృతి కలుగుతుంది. అనంతమైన తండ్రి మనకు అర్థం చేయిస్తున్నారని మీ బుద్ధిలో ఉంది. మొత్తం చక్రమంతటి జ్ఞానము మీ బుద్ధిలో నిండుగా ఉంది కావున ఎంత హర్షితముగా ఉండాలి. స్వయాన్ని ప్రశ్నించుకోవాలి - మాకు ఆ అవస్థ ఎందుకు ఉండడం లేదు? ఏ కారణము వలన హర్షితముగా ఉండడంలో ఆటంకం కలుగుతుంది? ఎవరైతే చిత్రాలను తయారుచేస్తారో, వారి బుద్ధిలో కూడా ఉంటుంది - ఇది మా భవిష్య పదవి, ఇది మా లక్ష్యము-ఉద్దేశ్యము మరియు ఇది 84 జన్మల చక్రము. సహజ రాజయోగము అన్న గాయనము కూడా ఉంది. బాబా రోజూ అర్థం చేయిస్తూ ఉంటారు - మీరు అనంతమైన తండ్రికి పిల్లలు కావున స్వర్గ వారసత్వాన్ని తప్పకుండా తీసుకోవాలి మరియు మొత్తం చక్రమంతటి రహస్యాన్ని కూడా అర్థం చేయించారు కావున తప్పకుండా దానిని స్మృతి చేయవలసి ఉంటుంది. అదే విధముగా మాట్లాడే మ్యానర్స్ కూడా చాలా బాగుండాలి. నడవడిక చాలా బాగుండాలి. నడుస్తూ, తిరుగుతూ, పనులు చేసుకుంటూ బుద్ధిలో కేవలం ఇదే ఉండాలి - మేము తండ్రి వద్దకు చదువుకోవడానికి వచ్చాము. ఈ జ్ఞానాన్నే మీరు మీతో పాటు తీసుకువెళ్ళాలి. చదువైతే సహజమైనదే కానీ ఒకవేళ పూర్తిగా చదవకపోతే టీచర్ కు తప్పకుండా ఈ ఆలోచన ఉంటుంది - క్లాసులో చాలా మందబుద్ధి గల పిల్లలు ఉంటే నా పేరు పాడవుతుంది, బహుమానం లభించదు, గవర్నమెంటు ఏమీ ఇవ్వదు అని. ఇది కూడా స్కూల్ కదా. ఇందులో బహుమానం మొదలైనవాటి విషయమేమీ లేదు. అయినా కానీ పురుషార్థమైతే చేయించడం జరుగుతుంది కదా. మీ నడవడికను తీర్చిదిద్దుకోండి, దైవీ గుణాలను ధారణ చేయండి. క్యారెక్టర్ బాగుండాలి. తండ్రి అయితే మీ కళ్యాణము కొరకే వచ్చారు. కానీ తండ్రి శ్రీమతముపై నడవలేకపోతారు.

శ్రీమతము - మీరు ఇక్కడకు వెళ్ళండి అని చెప్తే వెళ్ళరు. అక్కడ వేడి ఉంది, అక్కడ చలి ఉంది అని అంటారు. మాకు ఎవరు చెప్తున్నారు, తండ్రిని గుర్తించరు. ఈ సాధారణ రథమే బుద్ధిలోకి వస్తుంది. ఆ తండ్రి బుద్ధిలోకి రానే రారు. పెద్ద రాజులంటే అందరికీ ఎంత భయం ఉంటుంది. చాలా అథారిటీ ఉంటుంది. ఇక్కడైతే తండ్రి అంటారు, నేను పేదల పెన్నిధిని. రచయిత అయిన నా గురించి మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల గురించి ఎవరికీ తెలియదు. ఎంతమంది మనుష్యులు ఉన్నారు. ఎలాంటి-ఎలాంటి మాటలు మాట్లాడుతారు, ఏమేమో అంటూ ఉంటారు. అసలు భగవంతుడంటే ఎవరో కూడా తెలియదు. ఆశ్చర్యము కదా. తండ్రి అంటారు, నేను సాధారణ తనువులోకి వచ్చి నా పరిచయాన్ని మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల పరిచయాన్ని ఇస్తాను. ఈ 84 జన్మల మెట్లు ఎంత స్పష్టముగా ఉన్నాయి.

తండ్రి అంటారు, నేను మిమ్మల్ని ఈ విధముగా తయారుచేసాను, ఇప్పుడు మళ్ళీ అలా తయారుచేస్తున్నాను. మీరు పారసబుద్ధి కలవారిగా ఉండేవారు, మరి మిమ్మల్ని రాతిబుద్ధి కలవారిగా ఎవరు తయారుచేసారు? అర్ధకల్పం రావణ రాజ్యములో మీరు పడిపోతూనే వచ్చారు. ఇప్పుడు మీరు తమోప్రధానము నుండి సతోప్రధానముగా తప్పకుండా అవ్వాలి. తండ్రి సత్యమైనవారని, వారు తప్పకుండా సత్యాన్నే వినిపిస్తారని వివేకం కూడా చెప్తుంది. ఈ బ్రహ్మ కూడా చదువుతారు, అలాగే మీరు కూడా చదువుతారు. వీరు అంటారు - నేను కూడా విద్యార్థినే, చదువుపై అటెన్షన్ పెడతాను. ఏక్యురేట్ కర్మాతీత అవస్థ అయితే ఇప్పుడు ఇంకా తయారవ్వలేదు. ఇంతటి ఉన్నత పదవిని పొందేందుకు చదువుపై శ్రద్ధ పెట్టనివారు ఎవరు ఉంటారు? అందరూ అంటారు - ఇటువంటి పదవినైతే తప్పకుండా పొందాలి, మేము ఆ తండ్రికి పిల్లలము కావున తప్పకుండా యజమానులుగా అవ్వాలి. ఇకపోతే చదువులోనైతే పైకీ-కిందకీ అవుతూనే ఉంటుంది. ఇప్పుడు మీకు పూర్తిగా జ్ఞానము యొక్క సారము లభించింది. ప్రారంభములో పాత జ్ఞానమే ఉండేది. మెల్లమెల్లగా మీరు అర్థం చేసుకుంటూ వచ్చారు. జ్ఞానమనేది వాస్తవానికి ఇప్పుడే మాకు లభిస్తోంది అని ఇప్పుడు అర్థం చేసుకున్నారు. తండ్రి కూడా అంటారు - ఈ రోజు నేను మీకు గుహ్యాతిగుహ్యమైన విషయాలను వినిపిస్తాను. వెంటనే అయితే ఎవరూ జీవన్ముక్తిని పొందలేరు. మొత్తం జ్ఞానమంతటినీ తీసుకోలేరు. మొదట్లో ఏమైనా ఈ మెట్ల చిత్రము ఉండేదా. తప్పకుండా మనము ఈ విధంగా చక్రము చుట్టి వస్తామని ఇప్పుడు అర్థం చేసుకుంటారు. మనమే స్వదర్శన చక్రధారులము. బాబా ఆత్మలమైన మనకు మొత్తం చక్రమంతటి రహస్యాన్ని అర్థం చేయించారు. తండ్రి అంటారు, మీ ధర్మము చాలా సుఖాన్ని ఇచ్చే ధర్మము. తండ్రే వచ్చి మిమ్మల్ని స్వర్గాధిపతులుగా తయారుచేస్తారు. ఇతరుల సుఖము యొక్క సమయమైతే ఇప్పుడు వచ్చింది, ఈ సమయములో మృత్యువు ఎదురుగా ఉంది. ఈ విమానాలు, విద్యుత్తు మొదలైనవి ఇంతకుముందు లేవు. వారి కొరకైతే ఇప్పుడు ఇది స్వర్గము వంటిది. ఎంత పెద్ద-పెద్ద మహళ్ళను తయారుచేస్తారు. ఇప్పుడు మాకు చాలా సుఖము ఉంది అని వారు భావిస్తారు. లండన్ కు ఎంత త్వరగా చేరుకుంటారు. అంతే, ఇదే స్వర్గము అని భావిస్తారు. స్వర్గము అని సత్యయుగాన్ని అంటారని, కలియుగాన్ని స్వర్గము అని అనరని ఇప్పుడు వారికెవరైనా అర్థం చేయించాలి. నరకములో శరీరాన్ని వదిలితే తప్పకుండా పునర్జన్మను కూడా నరకములోనే తీసుకుంటారు. ఇంతకుముందు మీరు కూడా ఈ విషయాలను అర్థం చేసుకునేవారు కాదు, ఇప్పుడు అర్థం చేసుకుంటున్నారు. రావణ రాజ్యం రావడంతో మనం పడిపోవడం మొదలుపెడతాము, అన్ని వికారాలూ వచ్చేస్తాయి. ఇప్పుడు మీకు మొత్తం జ్ఞానమంతా లభించింది కావున నడవడిక మొదలైనవి కూడా చాలా రాయల్ గా ఉండాలి. ఇప్పుడు మీరు సత్యయుగములో కన్నా ఎక్కువ విలువైనవారు. జ్ఞానసాగరుడైన తండ్రి మొత్తం జ్ఞానమంతటినీ ఇప్పుడు ఇస్తారు. ఇతర మనుష్యులెవ్వరూ జ్ఞానాన్ని మరియు భక్తిని అర్థం చేసుకోలేరు. వారు ఈ రెండింటినీ కలిపేసారు. శాస్త్రాలు చదవడాన్ని జ్ఞానమని మరియు పూజ చేయడాన్ని భక్తి అని భావిస్తారు. ఇప్పుడు తండ్రి పుష్పాల వలె తయారుచేయడానికి ఎంతగా కష్టపడుతున్నారు. పిల్లలకు కూడా దయ కలగాలి, మీరు వచ్చి పతితులను పావనంగా తయారుచేయండి, పుష్పాలుగా తయారుచేయండి అని మీరు బాబాను పిలుస్తారు. ఇప్పుడు బాబా వచ్చారు కావున మీపై మీరు కూడా దయ చూపించుకోవాలి. మేము ఈ విధంగా పుష్పాలుగా అవ్వలేమా! ఇంతవరకు మేము బాబా హృదయ సింహాసనము పైకి ఎందుకు ఎక్కలేకపోయాము! అటెన్షన్ పెట్టరు. తండ్రి ఎంతటి దయార్ద్ర హృదయులు. మీరు వచ్చి పావనంగా తయారుచేయండి అని తండ్రిని పతిత ప్రపంచములోకే పిలుస్తారు. కావున ఏ విధముగా తండ్రికి దయ కలుగుతుందో, అలా పిల్లలకు కూడా దయ కలగాలి. లేదంటే, సద్గురువుకు నింద తీసుకొచ్చేవారు ఉన్నత స్థానాన్ని, ఉన్నత పదవిని పొందలేరు. సద్గురువు ఎవరు అన్నది ఎవరికీ స్వప్నములో కూడా ఉండదు. గురువు శాపాన్ని ఇస్తారేమో, అకృప జరుగుతుందేమోనని మనుష్యులు గురువుల గురించి భావిస్తారు. కొడుకు జన్మిస్తే గురువు కృప అని భావిస్తారు. ఇది అల్పకాలిక సుఖము యొక్క విషయము. తండ్రి అంటారు - పిల్లలూ, మీపై మీరు దయ చూపించుకోండి. దేహీ-అభిమానులుగా అయినట్లయితే

ధారణ కూడా జరుగుతుంది. అన్నీ ఆత్మయే చేస్తుంది. నేను కూడా ఆత్మనే చదివిస్తాను. స్వయాన్ని ఆత్మగా పక్కాగా భావించండి మరియు తండ్రిని స్మృతి చేయండి. అసలు తండ్రిని స్మృతే చేయకపోతే వికర్మలు ఎలా వినాశనమవుతాయి. భక్తి మార్గములో కూడా - ఓ భగవంతుడా, దయ చూపించండి అని తలచుకుంటారు. తండ్రి ముక్తిప్రదాత కూడా మరియు మార్గదర్శకుడు కూడా... ఇది కూడా వారి గుప్తమైన మహిమ. తండ్రి వచ్చి అన్ని విషయాలనూ తెలియజేస్తారు - భక్తి మార్గములో మీరు తలచుకుంటారు కానీ నేను తప్పకుండా నా సమయములోనే వస్తాను, ఈ విధముగా ఎప్పుడు కావాలంటే అప్పుడు రావడమనేది లేదు, డ్రామాలో ఎప్పుడు నిశ్చితమై ఉంటే అప్పుడు వస్తాను. ఇకపోతే ఇటువంటి ఆలోచనలు కూడా ఎప్పుడూ రావు. మిమ్మల్ని చదివించేవారు ఆ తండ్రి. వీరు కూడా వారి నుండే చదువుతారు. వారు ఎప్పుడూ ఏ పొరపాట్లు చేయరు, ఎవరికీ దుఃఖాన్ని కలిగించరు. మిగిలినవారంతా నంబరువారు టీచర్లుగా ఉన్నారు. ఆ సత్యమైన తండ్రి మీకు సత్యాన్నే నేర్పిస్తారు. సత్యమైనవారి పిల్లలు కూడా సత్యమైనవారే. తర్వాత, అసత్యమైనవారికి పిల్లలుగా అవ్వడంతో అర్ధకల్పం అసత్యంగా అయిపోతారు. ఇక సత్యమైన తండ్రినే మర్చిపోతారు.

ఇది సత్యయుగ కొత్త ప్రపంచమా లేక పాత ప్రపంచమా? అని మొట్టమొదట అర్థం చేయించండి. అప్పుడు, వీరు చాలా మంచి ప్రశ్నలు అడుగుతారు అని మనుష్యులు భావిస్తారు. ఈ సమయంలో అందరిలోనూ పంచ వికారాలు ప్రవేశించి ఉన్నాయి. అక్కడ పంచ వికారాలు ఉండవు. ఇది అర్థం చేసుకోవలసిన చాలా సహజమైన విషయము. కానీ ఎవరైతే స్వయమే అర్థం చేసుకోరో, వారు ప్రదర్శనీలో ఏమి అర్థం చేయిస్తారు? సేవకు బదులుగా డిస్సర్వీస్ చేసి వస్తారు. బయటకు వెళ్ళి సేవ చేయడం అంత సులువైన విషయమేమీ కాదు. చాలా తెలివి కావాలి. బాబా ప్రతి ఒక్కరి నడవడిక ద్వారా అర్థం చేసుకుంటారు. తండ్రి తండ్రే. కానీ ఇదే డ్రామాలో ఉంది అని తండ్రి కూడా అంటారు. ఎవరైనా వస్తే, ఒక బ్రహ్మాకుమారీ అర్థం చేయించడం మంచిదే. పేరు కూడా - బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అని ఉంది. పేరు కూడా బ్రహ్మాకుమారీలది ప్రసిద్ధమవ్వనున్నది. ఈ సమయంలో అందరూ పంచ వికారాలకు అలవాటు పడిపోయి ఉన్నారు. వారికి వెళ్ళి అర్థం చేయించడం ఎంత కష్టమవుతుంది. ఏమీ అర్థం చేసుకోరు, జ్ఞానమైతే బాగుంది అని కేవలం ఈ మాట అంటారు. స్వయం మాత్రం అర్థం చేసుకోరు. విఘ్నం వెనుక విఘ్నం వస్తూ ఉంటుంది. కావున యుక్తులను కూడా రచించవలసి ఉంటుంది. పోలీస్ కాపలాను ఉంచండి, చిత్రాలను ఇన్స్యూర్ చేయించండి. ఇది యజ్ఞము, ఇందులో విఘ్నాలు తప్పకుండా కలుగుతాయి. మొత్తం పాత ప్రపంచమంతా ఇందులో స్వాహా అవ్వనున్నది. లేదంటే యజ్ఞము అన్న పేరు ఎందుకు వచ్చింది. యజ్ఞములో స్వాహా అవ్వాలి. దీనికి రుద్ర జ్ఞాన యజ్ఞము అన్న పేరు ఉంది. జ్ఞానాన్ని చదువు అని కూడా అంటారు. ఇది పాఠశాల కూడా, అలాగే యజ్ఞము కూడా. మీరు పాఠశాలలో చదువుకుని దేవతలుగా అవుతారు, తర్వాత ఇదంతా ఈ యజ్ఞములో స్వాహా అయిపోతుంది. ఎవరైతే రోజు అభ్యాసము చేస్తూ ఉంటారో, వారే అర్థం చేయించగలుగుతారు. ఒకవేళ అభ్యాసం లేకపోతే వారేమి మాట్లాడగలరు. ప్రపంచములోని మనుష్యుల కొరకు స్వర్గము ఇప్పుడే ఉంది, అల్పకాలికముగా. మీ కొరకు స్వర్గము అర్ధకల్పం ఉంటుంది. ఇది కూడా డ్రామాగా రచింపబడి ఉంది. దీని గురించి ఆలోచిస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఇప్పుడు రావణ రాజ్యం సమాప్తమై రామ రాజ్యం స్థాపన అవుతుంది. ఇందులో యుద్ధము మొదలైనవాటి విషయమేమీ లేదు. ఈ మెట్లను చూసి మనుష్యులు చాలా ఆశ్చర్యపోతారు. తండ్రి ఏమేమి అర్థం చేయించారు. ఈ బ్రహ్మా కూడా తండ్రి నుండే నేర్చుకున్నారు, అదే అర్థం చేయిస్తూ ఉంటారు. కుమార్తెలు కూడా అర్థం చేయిస్తారు. ఎవరైతే అనేకుల కళ్యాణము చేస్తారో, వారికి తప్పకుండా ఎక్కువ ఫలము లభిస్తుంది. చదువుకున్నవారి ముందు చదువుకోనివారు తప్పకుండా తల వంచుతారు, సేవ చేస్తారు. తండ్రి ప్రతిరోజూ అర్థం చేయిస్తారు - మీ కళ్యాణమును చేసుకోండి. ఈ చిత్రాలను ముందు పెట్టుకోవడంతోనే నషా ఎక్కుతుంది, అందుకే బాబా ఈ చిత్రాలను గదులలో పెట్టించారు. లక్ష్యము-ఉద్దేశ్యము ఎంత సహజమైనది, ఇందులో క్యారెక్టర్ చాలా బాగుండాలి. హృదయం స్వచ్ఛంగా ఉంటే మనోకామన నెరవేరగలదు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సదా స్మృతిలో ఉంచుకోవాలి - మేము అనంతమైన తండ్రికి విద్యార్థులము, భగవంతుడు మమ్మల్ని చదివిస్తున్నారు, అందుకే బాగా చదువుకొని తండ్రి పేరును ప్రఖ్యాతము చేయాలి. తమ నడవడికను చాలా రాయల్ గా ఉంచుకోవాలి.

2. తండ్రి సమానంగా దయార్ద్ర హృదయులుగా అయి ముళ్ళ నుండి పుష్పాలుగా తయారవ్వాలి మరియు ఇతరులను పుష్పాలుగా తయారుచేయాలి. అంతర్ముఖులుగా అయి తమ మరియు ఇతరుల కళ్యాణం గురించి ఆలోచించాలి.

వరదానము:- అలజడిలో నిరాశపడేందుకు బదులుగా విశాల హృదయాన్ని ఉంచే ధైర్యవంతులుగా కండి

ఎప్పుడైనా ఏదైనా శారీరక అనారోగ్యము ఉన్నా, మానసిక తుఫాను ఉన్నా, ధనములో లేక ప్రవృత్తిలో అలజడి ఉన్నా, సేవలో అలజడి ఉన్నా - ఆ అలజడి సమయములో నిరాశపడకండి. విశాల హృదయం కలవారిగా అవ్వండి. లెక్కాచారము వచ్చినప్పుడు, నొప్పి కలిగినప్పుడు దాని గురించి ఆలోచించి-ఆలోచించి, నిరాశపడి దానిని పెంచుకోకండి, ధైర్యవంతులుగా అవ్వండి. అయ్యో, ఏం చెయ్యాలి... అని ఆలోచించకండి, ధైర్యాన్ని కోల్పోకండి. ధైర్యవంతులుగా అయినట్లయితే తండ్రి సహాయము స్వతహాగానే లభిస్తుంది.

స్లోగన్:- ఇతరుల బలహీనతలను చూసే నేత్రాలను మూసి వేసి మనస్సును అంతర్ముఖీగా చేసుకోండి.